www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 29 డిసెంబర్ 2024

5

డాక్టర్ బిఆర్.అంబేద్కర్
కోనసీమ

ఎరుపెక్కిన రాజమహేంద్రి

వాలంటీర్ల కవాతు

కోటిపల్లి బస్టాండ్ వద్ద జరిగిన బహిరంగ సభలో సిపిఎం నాయకులు సంఘీభావం

- ఉత్సాహంగా ప్రారంభమైన సిపిఎం జిల్లా మహాసభ
- నగరంలో భారీ ర్యాలీ, బహిరంగ సభ
- చైతన్యాన్ని నింపిన నాయకుల ప్రసంగాలు

ఎర్ర జెండాలతో చారిత్రాత్మక రాజమహేంద్రవరం నగరం ఎరుపెక్కింది. రెడ్‌షర్ట్ వాలంటీర్ల కవాతుతో నగర వీధులు అరుణార్ణవాన్ని పులుముకున్నాయి. మున్సిపల్ స్టేడియం నుంచి కోటిపల్లి బస్టాండ్ వరకూ నిర్వహించిన ప్రజా ప్రదర్శన ఉత్సాహంగా సాగింది. ప్రదర్శన అగ్ర భాగాన 24 జెండాలను పట్టుకుని రెడ్‌షర్ట్ వాలంటీర్ల కవాతు ప్రత్యేక ఆకర్షణగానిలిచింది. తీన్‌మార్ డప్పులు, ప్రజల నినాదాలతో దద్దరిల్లింది. ప్రజానాట్య మండలి కళాకారులు గీతాలు ఉత్సాహపరచగా... సిపిఎం తూర్పుగోదావరి జిల్లా మహాసభ శనివారం ప్రారంభమైంది.

:: ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి ::

సభలకు హాజరైన జనం

కందుకూరి స్ఫూర్తితో విశాల ఉద్యమాలు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఉమామహేశ్వరరావు

ప్రముఖ సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం స్ఫూర్తితో విశాల పోరాటాలకు ప్రజలు సంసిద్ధం కావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా మహాసభలో భాగంగా కోటిపల్లి బస్టాండ్ వద్ద జిల్లా కార్యదర్శి టి.అరుణ్ అధ్యక్షతన బహిరంగ సభను నిర్వహించారు. ఈ సభను ఉద్దేశించి వి.ఉమామహేశ్వరరావు మట్లాడారు. కూటమి ప్రభుత్వం లౌకిక తత్వంవైపా? సనాతన ధర్మం వైపా? అనేది ప్రజలకు చెప్పాలన్నారు. బాల్య వివాహాలు, సతీసహగమనం వంటి దురాచారాలకు వ్యతిరేకంగానూ, వితంతు పునర్వివాహాల కోసం, బాలికల విద్య కోసం కందుకూరి చేసిన పోరాటాలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ పక్షాన బిజెపి అనుసరిస్తున్న విధానాలు వీటన్నింటికీ వ్యతిరేకమన్నారు. సనాతన ధర్మాన్ని భుజాన వేసుకున్న ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చాతుర్వర్ణ వ్యవస్థను సమర్థిస్తారా..? అని నిలదీశారు.

రాజకీయ చైతన్యంతోనే ప్రత్యామ్నాయం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం

రాజకీయ చైతన్యంతోనే ప్రత్యామ్నాయ ప్రభుత్వం ఏర్పాటవుతుందని రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం అన్నారు. బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ఆరు నెలల్లోనే చంద్రబాబు పాలన ఘోరంగా విఫలమైందన్నారు. అనేక హామీలతో ప్రజలను మభ్యపెట్టి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. పాలకులు మారినా ప్రజల కష్టాలు మారలేదన్నారు. అవినీతిలో గత ప్రభుత్వంతో కూటమి ప్రభుత్వం పోటీ పడుతుందన్నారు. ప్రత్యామ్నాయ విధానాలతోనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ప్రజల్లో రాజకీయ చైతన్యం మరింత పెరగాలన్నారు. రాష్ట్ర భవిష్యత్తుకు సిపిఎం ఒక్కటే ప్రత్యామ్నాయమని తెలిపారు.

ప్రజా సమస్యలపై చొరవ చూపాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి అరుణ్

ప్రజా సమస్యలపై పాలకులు చొరవ చూపాలని జిల్లా కార్యదర్శి టి.అరుణ్ అన్నారు. బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ నూతన జిల్లా ఏర్పడి రెండున్నరేళ్లు గడిచినా ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు నిధులు కేటాయించలేదన్నారు. ఫలితంగా ప్రజలు తమ సమస్యలు విన్నవించుకునేందుకు అనేక వ్యయప్రయాసలతో బొమ్మూరులోని తాత్కాలిక కలెక్టరేట్‌కు వెళ్లాల్సి వస్తుందన్నారు. వ్యవసాయంపై అత్యధికంగా ఆధారపడిన ఈ జిల్లాలో సాగుకు ప్రోత్సాహం కరువైందన్నారు. నిడదవోలు, ఉండ్రాజవరం, గోదావరి డెల్టాలో పంట నష్టపోయిన రైతులకు ఇప్పటికీ పరిహారం అందలేదని విమర్శించారు. జిల్లాలో 31 పరిశ్రమలు ఉన్నాయని కరోనా అనంతరం వేతన ఒప్పందం అమలు చేయడంలో యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని తెలిపారు. ఆయా పరిశ్రమల్లో పనిచేస్తున్న 22 వేల మంది కార్మికులు భారంగా బతుకీడ్చుతున్నారని వాపోయారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఒఎన్‌జిసిలో కాంట్రాక్టర్లు, అధికారులు కుమ్మక్కై కార్మికులకు అన్యాయం చేస్తున్నారన్నారు. పేపరు మిల్లు యాజమాన్యం సైతం చేసిన వేతన ఒప్పందాన్ని అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్‌కు ఎన్నికలు జరిగి పదేళ్లు గడిచిందన్నారు. ప్రజల నుంచి వసూళు చేసిన పన్నులు ప్రత్యేకాధికారి పాలనలో ఇష్టారాజ్యంగా ఖర్చు చేస్తున్నారని విమర్శించారు. తాగునీటికి, మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయించకపోగా గత ప్రభుత్వం ఆప్కోదం పేరుతో కోట్లు రూపాయల నిధులను దుర్వినియోగం చేసిందన్నారు. 2027 పుష్కరాలకు సుమారు 2 కోట్ల మంది వస్తారని పాలనా యంత్రాంగం అంచనా వేస్తుందన్నారు. నగరంలో ఇప్పటికే ప్రజల అవసరాలకు తగ్గట్లుగా డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవటంతో చిన్నపాటి వర్షాలకే ముంపునకు గురౌతుందని గుర్తు చేశారు. నగరాభివృద్ధిపై దృష్టి సారించకపోతే ఆగస్టులో వచ్చే వరదలకు ప్రజలు ఇబ్బందులకు గురయ్యే అవకాశాలున్నాయని హెచ్చరించారు. ప్రస్తుతం పాలకులు చొరవ చూపించి జిల్లా అభివృద్ధి దిశగా అడుగులు వేయాలని లేనిపక్షంలో గత పాలకులకు పట్టిన దుస్థితి పునరావృతం కావడం ఖాయమన్నారు.

ప్రజాప్రదర్శనలో అగ్రభాగాన నడుస్తున్న నాయకులు

జిల్లా కమిటీ సభ్యులు జువ్వల రాంబాబు మాట్లాడుతూ కొన్నేళ్లుగా జిల్లాలో దళితులు, మైనార్టీలు, క్రిస్టియన్‌లు, మహిళలపై దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. ఈ దాడులకు వ్యతిరేకంగా సిపిఎం చేసిన పోరాటాలను, సాధించిన విజయాలను గుర్తు చేశారు. తాజాగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆర్‌ఎస్‌ఎస్ విధానాలను అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఎం.సుందరబాబు, కెఎస్‌వి.రామచంద్రరావు, వై.బేబిరాణి, పి.తులసి, బి.పవన్, ఎన్.రాజా, సీనియర్ నాయకులు ఎస్ఎస్ మూర్తి, పోలిన వెంకటేశ్వరరావు, టిఎస్.ప్రకాష్, ఐద్వా నాయకులు జరీనా, వెంకటలక్ష్మి, సిపిఎం నగర కార్యదర్శి కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతినిధుల సభ ప్రారంభం

బహిరంగ సభ అనంతరం రౌతు తాతాలు కళ్యాణమండపంలో ప్రతినిధుల సభ ప్రారంభమైంది. వంద మంది ప్రతినిధులు హాజరయ్యారు. తొలుత సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.సుందర్‌బాబు సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. ఆలిండియా కార్యదర్శి సీతారాం ఏచూరి, పశ్చిమ గోదావరి జిల్లా సిపిఎం సీనియర్ నాయకులు రుద్రరాజు సత్యనారాయణ (ఆర్‌ఎస్), ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్‌సాబ్జీ, సిఐటియు తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి బి.రాజులోవ, సిపిఎం రంపచోడవరం జిల్లా కమిటీ సభ్యులు పూనం సత్యనారాయణ మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రహదారి నిబంధనలు పాటించాలి : ఎస్ఐ

ప్రజాశక్తి - ఆలమూరు

వాహనదారులు రహదారి నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్ఐ ఎం.అశోక్ అన్నారు. మండల పరిధిలోని వివిధ కూడళ్ళలో ఆయన ఆధ్వర్యంలో వాహన తనిఖీలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా వాహనదారులు మద్యం సేవించి వాహనం నడిపితే జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. ఇటీవల మద్యం తాగి వాహనం నడుపుచున్న చెముడులంకకు చెందిన ఒక వ్యక్తిని అదుపులోనికి తీసుకొని ఆలమూరు కోర్ట్ లో మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా, మేజిస్ట్రేట్ ప్రవీణ్ కుమార్ ఆరునెలల పదిహేను రోజులు జైలు శిక్ష విధించిన విషయం ఎవ్వరు మరువవద్దన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే వాహన దారులు నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. కొత్తగా ప్రవేశపెట్టిన చట్టం ప్రకారం మద్యం తాగి వాహనం నడపడం వల్ల కలిగే మరణాలకు సుమారు ఐదు నుంచి పది ఏళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారని తెలిపారు. అంతేకాకుండా జరిమానా కూడా ఎక్కువ వేసే అవకాశం ఉందని, ఒకవేళ ప్రమాదంలో చనిపోయిన వ్యక్తి మరణానికి సరైన కారణం చెప్పకపోతే జైలుతో సహా అదనపు కఠినమైన శిక్షలు విధించే విధంగా చట్టాన్ని మార్చారని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడపడం ద్వారా ప్రమాదానికి గురైతే కుటుంబీకులు ఇబ్బంది పడతారని, ప్రధానంగా యువత మద్యం మత్తులో వాహనాలు వేగంగా నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. అదే విధముగా హెల్మెట్ ను తప్పని సరిగా ధరించాలని, తమ కోసం ఇంటి వద్ద భార్య, పిల్లలు తల్లితండ్రులు ఎదురుచూస్తూ ఉంటారనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని వాహనదారులకు ఎస్ఐ అశోక్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ సూర్యచంద్రరావు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

కొత్తూరు సెంటర్ వద్ద వాహన తనిఖీలో ఎస్ఐ అశోక్

ఉత్సాహంగా మహిళా వాలీబాల్ పోటీలు

- హాజరైన మంత్రులు నిమ్మల, వాసంశెట్టి
- తలపడిన వివిధ రాష్ట్రాల జట్లు

వాలీబాల్ పోటీలను తిలకిస్తున్న మంత్రులు నిమ్మల, వాసంశెట్టి, ఎంఎల్ఎ ఆనందరావు తదితరులు

పాండిచ్చేరి-గోవా జట్ల మధ్య జరుగుతున్న పోటీ

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

ఎస్.యానాం బీచ్‌లో అమలాపురం ఎంఎల్ఎ, టోర్నమెంట్ గౌరవ అధ్యక్షులు అయితాబత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో జాతీయస్థాయి మహిళా బీచ్ వాలీబాల్ పోటీలు శనివారం ఉత్సాహంగా సాగాయి. డే అండ్ నైట్ ఫ్లడ్‌లైట వెలుగుల్లో సముద్ర అలల చేరువలో జరుగుతున్న వాలీబాల్ పోటీలలో మన రాష్ట్రంతో పాటు గుజరాత్, గోవా, కేరళ, పాండిచ్చేరి, తమిళనాడు, వెస్ట్ బెంగాల్ జట్లు హోరాహోరీ తలపడుతున్నాయి. లీగ్ కం నాకౌట్ పద్ధతిలో ఈ ప్రాంతంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పోటీలకు రాష్ట్ర మంత్రులు నిమ్మల రామానాయుడు, వాసంశెట్టి సుభాష్‌లు హాజరై వాలీబాల్ పోటీలను తిలకించారు. వారిని ఎంఎల్ఎ ఆనందరావు దుశ్శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రులు నిమ్మల రామానాయుడు, వాసంశెట్టి సుభాష్ లు మాట్లాడుతూ క్రీడలు జాతీయ సమైక్యతకు దోహదపడతాయన్నారు. బీచ్‌లో వ్యయ ప్రయాసలతో వాలీబాల్ పోటీలను ఎంఎల్ఎ ఆనందరావు నిర్వహిస్తుండడం అభినందనీయమని అన్నారు. రాత్రి సమయంలో బీచ్‌లో వాలీబాల్ పోటీలను తిలకించేందుకు పెద్ద ఎత్తున క్రీడాభిమానులు విచ్చేశారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ కె.మాధవి, రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, నాయకులు దేశం శెట్టి లక్ష్మీనారాయణ, దంగేటి చిట్టిబాబు, పెచ్చెట్టి చంద్రమౌళి, పినిశెట్టి నరసింహారావు, చెరుకూరి శ్రీరామ్, కంకటాల రామం, ఇసుకపట్ల రఘుబాబు, టోర్నీ అధ్యక్షులు పలచోళ్ళ పద్మనాభం ఉపాధ్యక్షులు లంకే భీమరాజు, కార్యనిర్వాహక కార్యదర్శి పిడి గొలకోటి ఫణీంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ తెలుగు మహాసభలో యువ రచయిత శ్రీనివాస్

ప్రజాశక్తి - ఆలమూరు

కృష్ణాజిల్లా విజయవాడలో జరుగుతున్న ఆరవ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలో ఆలమూరుకు చెందిన యువ రచయిత గొడవర్తి శ్రీనివాస్ శనివారం పాల్గొన్నారు. ఈ మహాసభలకు అతిథిగా తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరి పార్లమెంటు సభ్యులు కె.గోపినాథ్, పలువురు ప్రముఖులు విచ్చేశారు. పార్లమెంటులో తెలుగులో ప్రమాణ స్వీకారం చేసిన తమిళనాడు ఎంపీ తమిళనాడులో తెలుగు భాష రక్షణ కోసం పాటుపడుతున్న భాషాయోధుడు గోపినాథ్‌కు , ప్రముఖ రచయితలకు ఆలమూరోళ్ల కథల పుస్తకాలను శ్రీనివాస్ అందజేశారు. ఈ సందర్భంగా పుస్తక సంకలనకర్త గొడవర్తి శ్రీనివాసును పలువురు అభినందించారు.

ఆలమూరోళ్ల కథల పుస్తకాన్ని అందజేస్తున్న శ్రీనివాస్

దేవదాయ కమిషనర్‌కు స్వామివారి చిత్రపటంఅందజేస్తున్న ఆలయ డిసి

యాత్రికుల సౌకర్యాల కల్పనకు కృషి

దేవదాయ శాఖ కమిషనర్

ప్రజాశక్తి - ఆత్రేయపురం

కోనసీమ తిరుమలగా పేరుగాంచిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి వచ్చే యాత్రికులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు ఎపి దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ అన్నారు. శనివారం ఆయన వాడపల్లి వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ డిసి నల్లం చక్రధరరావు, ఆలయ అర్చకులు, సిబ్బంది. ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు . స్వామివారి దర్శనం అనంతరం ఆలయ డిసి తో ఆయన సమీక్షించారు. శనివారం ఏ మేర భక్తులు వస్తారు వారికి ఏమీ సౌకర్యాలు కల్పిస్తున్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యూలైన్లో యాత్రికులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. వద్ధులకు, వికలాంగులకు దర్శనాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు..

యుటిఎఫ్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -ఐ.పోలవరం

యుటిఎఫ్-2025 క్యాలెండర్,డైరీలు శనివారం మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద ఎంఇఒలు .ఎన్.కొండారెడ్డి, తిరుమలరావు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ యుటిఎఫ్ విద్యారంగానికి ఉపాధ్యాయ సంక్షేమానికి అనేక సేవలు అందివ్వడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ రేవు అప్పలస్వామి, వి.శాస్త్రి, యుటిఎఫ్ మండల అధ్యక్షులు అప్పాడి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పడమటి ఏడుకొండలు, జత్తగ సూర్యనారాయణ, ఎం శ్రీనివాసరావు, పి.శ్రీను, కె.శివరామకృష్ణ పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



గుమ్మిలేరు రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని గుమ్మిలేరు బస్టాండ్ సెంటర్ నుండి మోదుకూరు ఒఎన్‌జిసి రిగ్గు వరకు ఆర్అండ్‌బి రోడ్డుకు మరమ్మతు పనులు చేపట్టారు. ఈ మేరకు శనివారం రోడ్డు మరమ్మతు పనులను గుమ్మిలేరు సర్పంచ్ గుణ్ణం రాంబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఒఎన్‌జిసి భారీ వాహనాల వలన రోడ్డు పలుచోట్ల ఛిద్రంగా మారిందని అన్నారు. దీంతో ఆ రహదారిపై వెళ్లే ప్రయాణికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. ఈ విషయాన్ని ఒఎన్‌జిసి అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లామని పేర్కొన్నారు. ఈ మేరకు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టిన నేపథ్యంలో సర్పంచ్ రాంబాబు ఒఎన్‌జిసి అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

రైతు బజార్ ప్రారంభానికి చర్యలు

ప్రజాశక్తి - అమలాపురం

జిల్లా కేంద్రం అమలాపురం మధ్యలో ఉన్న రైతు బజార్ పున:ప్రారంభించేందుకు చర్యలు చేపట్టినట్లు జెసి టి.నిషాంతి వెల్లడించారు. శనివారం స్థానిక రైతు బజార్ నందు రైతు అవగాహనా సదస్సును వివిధ మండలాలకు చెందిన రైతులు ఉద్యాన, మార్కెటింగ్ మత్స్య శాఖల అధికారులతో నిర్వహించారు ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ కొంతకాలం క్రితం ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా మార్కెటింగ్ శాఖ ఆధ్వ ర్యంలో రైతుబజారులు నెలకొల్పినప్పటికీ వివిధ కారణాలు మూలంగా పూర్తిస్థాయిలో నిర్వహణ జరగడంలేదని గుర్తించి పునరుద్ధరణకు చర్యలు చేపట్టామన్నారు. జిల్లాకు సంబంధించి అమలాపురం, రాయవరం, రైతు బజార్ల సమస్యలు ఈనెల 18న రాష్ట్ర వ్యవసాయ ఉద్యాన మార్కెటింగ్ సహకార మత్స్య శాఖల మంత్రి వర్యులు జిల్లా సమీక్ష కమిటీ సమావేశం దష్టికి కూడా వచ్చిందన్నారు. తదనుగుణంగా పున్షప్రారంభానికి చర్యలు చేపట్టినట్లు ఆమె వెల్ల డించారు మార్కెటింగ్ విభాగం వారు రైతు బజారు నిర్వహణకు పటి ష్టమైన చర్యలు చేపట్టా లని, ఉద్యాన శాఖ అధికారులు గ్రామాల లోని కూరగాయలు పండించే రైతులను గుర్తించి దరఖాస్తులు అందించు కూరగాయ లను పండించిన నేరుగా రైతులే ఎటువంటి ఫీజు చెల్లించనవసరం లేకుండా విక్రయాలు జరుపుకునే విధంగా చైతన్య పర చాలని ఆదేశించారు.కార్యక్రమంలో స్థానిక ఆర్‌డిఒ, జిల్లా రెవెన్యూ అధికారి ఇన్చార్జ్ కే మాధవి జిల్లా ఉద్యాన శాఖాధికారి బివి.రమణ, జిల్లా మత్స్య శాఖ అధికారి ఎన్. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జెసి

విలేకరి దేవానంద్‌కు పలువురి పరామర్శ

ప్రజాశక్తి - రామచంద్రపురం

ప్రజాశక్తి నియోజకవర్గ విలేకరి సిహెచ్ దేవానంద్‌కు ఇటీవల మాతృ వియోగం కలిగింంది. ఆయన తల్లి చొప్పెల్ల సీతమ్మ(80) ఇటీవల మరణించారు. శనివారం విలేకరి దేవానంద్, ఆయన కుటుంబ సభ్యులను పలువురు పరామర్శిం చారు. పరామర్శించిన వారిలో మంత్రి వాసంశెట్టి సుభాష్, వైసిపి నియోజకవర్గ ఇన్చార్జ్ పిల్లి సూర్యప్రకాష్ , హైకోర్టు న్యాయవాది కర్రీ గనీరెడ్డి, బార్ అసోసియేషన్ నాయకులు చిన్నం వీరరెడ్డి, ఎంపిపి అంబటి భవాని, కె.గంగవరం ఎంపిపి పంపన నాగమణి సుబ్బారావు, మాజీ ఎంపిపి, వట్టికూటి రాజశేఖర్, దళిత సంఘం నాయకులు పెట్ట శ్రీనివాస్, సర్పంచ్ ఎల్లమెల్లి సతీష్ కుమారి, విద్యుత్ ఉద్యోగుల సంఘం నాయకులు వై.రవికుమార్, బీసీ సంఘం నాయకులు వాసంశెట్టి శ్యామ్, పత్రికా సంఘం, జై భీమ్ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, పిడిఎస్‌యు నాయకులు తదితరులు ఉన్నారు.



దేవానంద్‌ను పరామర్శిస్తున్న మంత్రి సుభాష్

ఆక్వా చెరువులపై సర్వే చేపట్టాలి

ప్రజాశక్తి - అమలాపురం

సముద్ర తీర ప్రాంత ఆక్వా జోన్, ఆక్వాయేతర జోన్లలో ఎంత మేర విస్తీర్ణంలో ఆక్వాచెరువులు ఉన్నది జియో కోఆర్డినేట్స్ మ్యాపులతో సహా బందాలు సర్వే ఆధారంగా కచ్చితత్వంతో కూడిన నివేదికలను సమ ర్పించాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్ నందు కాలుష్య నియంత్రణ మండలి భూగర్భ జలశాఖ, మత్స్య శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. కోస్టల్ రీజియన్ జోన్ కోస్తా తీర ప్రాంత మేనేజ్మెంట్ హరిత ట్రిబ్యునల్ భూగర్భ, జలశాఖ, కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాలు ఆచరణ ఆక్వా చెరువుల అనుమ తులు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ మత్స్య, రెవెన్యూ, వ్యవ సాయ శాఖల అధికారులతో సర్వే బృందాలు నియమించి ఆక్వా జోన్ ఆక్వాయేతర జోన్లలో ఎంత మేర విస్తీర్ణంలో చెరువులు ద్వారా ఆక్వా సాగు సాగుతున్నది క్షేత్ర స్థాయిలో నిశితముగా పరిశీలించి నివేదికలను రూపొందించి సమర్పించాలని ఆదేశించారు. అదేవిధంగా సాగులో ఉన్న చెరువులకు అనుమతులు ఉన్నది లేనిది మార్గదర్శకాలు ఆచరిస్తున్నది లేనిది నివేదికలో పొందుపరిచి సమర్పించాలన్నారు. ప్రస్తుతం సాగులో ఉన్న 46 వేలు ఎకరాలకు, ఆక్వా జోన్లో లేని ఏడు వేల ఎకరాలకు గ్రామ, మండల, డివిజన్ వారీగా ఆక్వాజోనేషన్ టైపును నిర్ధారించాలన్నారు. నూతనంగా వెలువడిన జిఒ ఎంఎస్ నెంబర్ 7 ప్రకారం ఆక్వా చెరువుల అనుమ తులను మంజూరు చేయా లని సూచించారు. హరిత ట్రిబ్యునల్ నిబంధనలకు విరుద్ధంగా ఆక్వా సాగులో ఉన్న చెరువుల రద్దుకు సంబంధించి వైనతేయి నదిని ఆనుకొని ఉన్న గొల్లపాలెం కరవాక, గోగన్నమఠం లలో కొనసాగుతున్న రద్దు చర్యలు వేగవంతం చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్ర మంలో జెసి టి.నిషాంతి, ఇన్‌చార్జి ఆర్‌డిఒ కె.మాధవి, జిల్లా మత్స్య శాఖ అధికారి ఎన్.శ్రీనివాసరావు, జిల్లా కాలుష్య నియంత్రణ మండలి కార్యనిర్వాహక ఇంజినీర్ శంకర్రావు, జిల్లా వ్యవసాయ అధికారి వి.బోసు బాబు, భూగర్భ జల శాఖ సహాయ సంచాలకులు శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్ కుమార్

నేరాలు ఘోరాలు

బైకును ఢీకొన్న కారు

ప్రజాశక్తి - పిఠాపురం

మండలం ఎఫ్‌కె పాలెం గ్రామంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటార్ సైకిల్‌పై వస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. స్థానికులు,పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెదపూడి నుంచి మోటార్ సైకిల్‌పై అన్నదమ్ములు ఎం.రాజ్‌కుమార్, వసంతకుమార్ జల్లూరు మీదుగా భోగాపురం గ్రామంలో బంధువుల ఇంటికి వస్తున్నారు. వారిని ఎఫ్‌కె పాలెం వద్ద పిఠాపురం నుంచి సామర్లకోట వెళ్తున్న కారు ఢీకొట్టడంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. వైద్యం నిమిత్తం వారిని స్థానికంగా ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. పిఠాపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యంపై కేసు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని చేబ్రోలు గ్రామానికి చెందిన 16 సంవత్సరాల బాలిక అదశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 27వ తేదీ ఉదయం 7 గంటలు చేబ్రోలు గ్రామానికి చెందిన 16 సంవత్సరాల బాలిక పిఠాపురం కాలేజీకి వెళ్లింది. అయితే సాయంత్రానికి తిరిగి ఆమె ఇంటికి రాలేదు. దీంతో ఆమె తల్లిదండ్రులు గొల్లప్రోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్‌ఐ ఎన్.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధి లో శనివారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1200 లీడర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ అర్జునరావు తెలిపారు. మండలంలోని చదలాడ గ్రామంలో నిర్వహించిన దాడుల్లో 400 లీటర్లు, సూరంపాలెం గ్రామంలో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 800 లీటర్లు బెల్లపు ఊటను ధ్వంసం చేసామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐలు చిట్టిబాబు, ప్రసాదరావు పాల్గొన్నారు.

12 మంది బైండోవర్

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలో 12 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామని ఎస్‌ఐ రామ్ కుమార్ తెలిపారు. వీరందరినీ సీతానగరం తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ వద్ద హాజరుపరిచి సత్ప్రవర్తనతో ఉండేలా ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. బైండోవర్ ఉత్తర్వులు ఉల్లంఘించి ప్రవర్తిస్తే వారిపై రూ.2 లక్షలు జరిమానా విధిస్తూ, చట్టవిరుద్ధ పనులు చేసేవారిగా గుర్తుస్తూ తదుపరి చర్యలు తీసుకోంటామని హెచ్చరించారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

అనారోగ్యంతో ఒక వ్యక్తి మృతి రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. దీనిపై శనివారం పోలీసు వివరాలు ప్రకారం పశ్చిమ బంగ్లా రాష్ట్రానికి చెందిన గణేష్ మాజీ వ్యవసాయ పనులు చేసుకునేందుకు తోటి కూలీలు 15 మందితో ఈనెల 23వ తేదీన తన స్వగ్రామం నుంచి బయలుదేరాడు. అతను 24న సాయంత్రం మండలంలోని లొల్ల గ్రామంలోని మకాం వద్దకు చేరుకున్నారు అప్పటికి గణేష్ మాజీ అనారోగ్యంతో ఉన్నాడు. 25న వరి నాట్లు వేసేందుకు గణేష్ మాజీ కూలీలతో వెళ్లి అనారోగ్యంతో ఉండడంతో అతను పని చేయకుండా సాయంత్రం వరకు వారితోనే ఉన్నాడు. ఆరోజు సాయంత్రం అతను తోటి కూలీలతో కలిసి మకాం వద్దకు వెళ్లిన తర్వాత కనబడకలేదు. దీంతో తోటి కూలీలు, స్థానికులు చుట్టుపక్కల ప్రాంతాలు వెతికినప్పటికీ అతని ఆచూకీ లభ్యం కాలేదు. 27వ తేదీ శుక్రవారం ఉదయం కట్టుంగ గ్రామ పరిధిలోని గన్నవరం కాలువ సమీపంలో ఒక వ్యక్తి పడి ఉన్నాడంటూ స్థానిక రైతు పోలీసులకు ఫోన్ చేశాడు. దీంతో పోలీసులు, స్థానికులు, తోటి కూలీలు అక్కడ చేరుకుని అతని కొత్తపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి 10.30 గంటలకు మృతి చెందాడు. ఆసుపత్రి నుండి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎస్.రాము తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

తాళ్లరేవు : మండలంలోని చొల్లంగి వద్ద జాతీయ రహదారి 216పై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. కోరంగి ఎస్‌ఐ పి. సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ ఏటిమొగకు చెందిన పాలెపు వీరబాబు మట్లపాలెంలోని తన అత్తవారింటికి మోటార్ సైకిల్‌పై బయలుదేరాడు. చొల్లంగి రైస్ మిల్ సమీపంలో ఎదురుగా యానం నుంచి వస్తున్న కారు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వీరబాబుకు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి చేరుకున్న కోరంగి ఎస్‌ఐ. పి. సత్యనారాయణ క్షతగాత్రున్ని 108లో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మందేశ్వరస్వామిని దర్శించుకున్న దేవాదయ శాఖ కమిషనర్

ప్రజాశక్తి - కొత్తపేట

దేవదాయ ధర్మదాయ శాఖ కమిషనర్ శ్రీరాము సత్యనారాయణ శనిత్రయోదశి సందర్భంగా స్వామివారికి తైలాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి వారిని దర్శించుకునియున్నారు. వారికి అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, స్వామి వారి శేష వస్త్రం, చిత్రపటం, ప్రసాదాలు ఉప కమిషనర్, కార్య నిర్వహణ అధికారి నల్లం సూర్య చక్రధర్ రావు అందజేశారు. మందేశ్వర స్వామి వారి పూజలు నిమిత్తం అనంతరం వారు 7 సంవత్సరాములక గాను ప్రతీ శనివారం పరోక్షంగా తైలాభిషేకముల నిమిత్తం రూ.1,45,600 చెల్లించారు.

రూ. 33.85లక్షల ఆదాయం

మందేశ్వర స్వామి దేవస్థానం నందు శని త్రయోదశి సందర్భంగా స్వామివారికి తైలాభిషేకములు ద్వారా రూ.27,53,720, ఆన్లైన్, క్యూఆర్ కోడ్ ద్వారా పరోక్ష పూజలు ద్వారా రూ.5,89,400, అన్న ప్రసాదం విరాళాలుగా రూ.42,818 మొత్తం వెరసి రూ.33,85,938 ఆదాయం వచ్చిందని ఉప కమిషనర్, కార్యనిర్వహణాధికారి నల్లం సూర్య చక్రధర రావు, తెలిపారు.

ఆవేదన... ఆందోళన...

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

అల్పపీడన ప్రభావంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఈ వారంలో కురిసిన వర్షాలు అన్నదాతలను ఆందోళనకు గురి చేశాయి. రైతులు ధాన్యం ఆరబెట్టుకునే సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వ వైఫల్యం మరోసారి తేటతెల్లమైంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సుమారు 5.50 లక్షల ఎకరాల్లో వరిసాగు జరిగిన విషయం విదితమే. కోనసీమ, కాకినాడ జిల్లాల్లో వర్షం ప్రభావం అధికంగా ఉంది. ఆరుగాలం కష్టించి పంట చేతికొచ్చే నాటికి కురిసిన అకాల వర్షాల ఫలితంగా నష్టాలు తప్పడం లేదనే ఆవేదన రైతుల్లో వ్యక్తమైంది. కల్లాలలోని ధాన్యం ఒబ్బిడి చేసుకునేందుకు రైతులు ఇబ్బందులు తప్పలేదు. వ్యవసాయ ఆధారిత ఈ జిల్లాలో అత్యధిక మంది సాగుపై ఆధారపడి జీవిస్తున్నారు. పాలక ప్రభుత్వాలు అన్నదాతల సమస్యలపై చిత్తశుద్ధి లోపించింది. గతంలో బరకాలు పంపిణీ జరిగేది. ఆరేళ్లుగా ఆ దిశగా ప్రయత్నం జరగలేదు. మరో వైపు కొనుగోళ్ల ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. దిగుబడుల్లో కొనుగోలు లక్ష్యం 60 శాతానికి మించడం లేదు. కొనుగోలు ప్రక్రియలో ప్రభుత్వ నిబంధనలు అడ్డుగోడలుగా మారుతున్నాయి. దీంతో రైతులు దళారులను ఆశ్రయించక తప్పడం లేదు. నూతన ప్రభుత్వమైనా అన్నదాతలను ప్రోత్సహించే దిశగా అడుగులు వేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

జీడిపిక్కల కార్మికుల ఉద్యమం ఉధృతం

చిన్నింపేట జీడిపిక్కల ఫ్యాక్టరీ మూసివేతతో కార్మికులు చేపట్టిన ఆందోళనలు మిన్నంటాయి. రెండు నెలలుగా కార్మికులు శాంతియుతంగా నిరసనలు తెలిపినప్పటికీ పాలనా యంత్రాంగం జోక్యం చేసుకోకపోవడం పలు విమర్శలకు దారి తీసింది. ఆందోళన కార్యక్రమాలలో భాగంగా ప్రతిపాడు ఎంఎల్‌ఎ ఇంటి వద్ద చేపట్టిన ఆందోళనలను పోలీసులు భగ్నం చేసేందుకు చేసిన ప్రయత్నం విఫలమైంది. తమ సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న ఆందోళనలపై ఎంఎల్‌ఎ సమాధానం ఇవ్వాలంటూ కార్మికులు ఆందోళనలను కొనసాగించారు. దీంతో ఎట్టకేలకు ఎంఎల్‌ఎ తన నివాసం నుంచి బయటకు వచ్చి కార్మికులతో మాట్లాడారు. ఫ్యాక్టరీ యాజమాన్యంతో చర్చిస్తామంటూ హామీ ఇవ్వడంతో కార్మికులు ఎంఎల్‌ఎ ఇంటి ఎదుట ఆందోళన విరమించారు. రాజమమహేంద్రవరంలోని ఎపి పేపరు మిల్లు యాజమాన్య ప్రతినిధులు, కార్మిక సంఘాలతో కలెక్టరు అధ్యక్షతన జరిగిన సమావేశంలోనూ యాజమాన్య మొండి వైఖరి తేటతెల్లమైంది. కార్మిక సంఘాల ప్రతినిధులు వివరించిన సమస్యలపై ప్రజా ప్రతినిధులు ఏకీభవించారు. ఎపి పేపరు మిల్లుయాజమాన్యం కార్మికుల వేతన ఒప్పందంపై సానుకూలంగా స్పందించటంతో పాటు ప్రభుత్వానికి పన్ను బకాయిలు తక్షణమే చెల్లించాలని కోరారు.

విద్యుత్ ఉద్యమం మరో మైలు రాయి

విద్యుత్ బిల్లులకు వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనలు మిన్నంటాయి. విద్యుత్ ఛార్జీలు పెంచబోమంటూ ఎన్నికల ముందు కూటమి తరపున టిడిపి అధినేత చంద్రబాబు హామీ ఇచ్చిన విషయం విదితమే. అధికారంలోకి వచ్చిన 6 నెలలో విద్యుత్ ఛార్జీలు పెంచి తన వైఖరిని దర్పణం పట్టారు. ఈ నేపథ్యంలో తాజాగా చలికాలంలోనూ విద్యుత్ బిల్లులు అధికంగా రావటంతో ప్రజలలో ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రజా ఆందోళనల నేపథ్యంలో ప్రతిపక్ష వైసిపి కూడా ఆందోళన బాటపట్టింది. విద్యుత్ ఛార్జీలపై జిల్లావ్యాప్తంగా ఆందోళనలను నిర్వహించింది. ఈ కార్యక్రమాలకు ప్రజాభాగస్వామ్యం క్రమ క్రమంగా పెరుగుతోంది. ప్రభుత్వం ఇప్పటికైనా విద్యుత్ ఛార్జీల భారాలను ఉపసంహరించుకోవాలని ప్రజలు, ప్రజా సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.

స్ఫూర్తి నింపిన మహాసభలు

ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహించే వామపక్ష పార్టీల మహాసభలు ఈ వారంలో ఉత్సాహంగా జరిగాయి. కాకినాడ జిల్లా మహాసభల నేపథ్యంలో పెద్దాపురం పట్టణం ఎరుపెక్కిన విషయం విదితమే. వేలాది మంది కార్యకర్తలు, ప్రజలు, ఉద్యోగులు పాల్గొన్నారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం, తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో సిపిఎం మహాసభలు జరిగాయి. ఈ మహాసభలకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుతో సహ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు హాజరై దిశానిర్దేశం చేశారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. ప్రజా చైతన్యంతోనే పాలకుల దుశ్చర్యలను అడ్డుకోగలమని పిలుపునిచ్చారు. నూతన కమిటీలతో సమరోత్సాహంతో ప్రజా సమస్యలపై పోరుకు కామ్రేడ్లు సన్నద్ధమయ్యారు.

పలు చోట్ల రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి - యంత్రాంగం

పలు చోట్ల శనివారం రెవెన్యూ సదస్సులు నిర్వహించామని అధికారులు తెలిపారు.

మామిడికుదురు:రెవెన్యూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం సదస్సులు నిర్వహిస్తోందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ వైవి.సుబ్రహ్మణ్యాచారి అన్నారు. శనివారం పెదపట్నం లంక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద రెవెన్యూ గ్రామ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముందుగా అవగాహనా ర్యాలీ నిర్వహించారు ఈ సదస్సుల ద్వారా భూ సమస్యలు, సర్వే సమస్యలు, భూ వివా దాలు, తదితర సమస్యలపై, రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తహశీల్దార్ తెలిపారు ఈ కార్యక్రమంలో ఎంపిటిసి కొమ్ముల జంగమయ్య, గ్రామ కార్యదర్శి డి సురేష్ , కొమ్ముల నారాయణ స్వామి, ఆర్ఐ, విఆర్‌ఒలు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, రైతులు తదితరులు, పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: కేదాలంక, అద్దంకి వారి లంక, గ్రామాల్లో శనివారం రెవెన్యూ సదస్సులు జరిగాయి. ఆయా గ్రామ సర్పంచులు వీధి వెంకటరెడ్డి, నాతి గవరయ్య, అధ్యక్షతన జరిగిన రెవెన్యూ గ్రామ సభల్లో మండల ప్రత్యేక అధికారి డిఎల్‌డిఒ కామేశ్వరరావు, తహశీల్దార్ పి.చిన్నారావు పాల్గొని మాట్లాడారు. భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివిధ భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ అధికారులు రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. రెవెన్యూ, పంచాయతీ, తదితర అధికారులు, సిబ్బందితో గ్రామంలో ర్యాలీ నిర్వహించి రెవెన్యూ సదస్సులపై ప్రజలకు అవగాహన కల్పించారు. మండలంలోని ఈ నెల 10 న ప్రారంభమైన రెవెన్యూ సదస్సులు శనివారంతో ముగిసినట్లు తహశీల్దార్ చిన్నారావు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఆర్ఐ అజ్జమ్మ, గ్రామా సర్వేయర్లు, పలు గ్రామాల విఆర్‌ఒలు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, రైతులు తదితరులు, పాల్గొన్నారు.

రామచంద్రపురం: రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసిందని వీటిని సద్వినియోగం చేసుకోవాలని రామచంద్రపురం ఆర్‌డిఒ దేవరకొండ అఖిల అన్నారు. శనివారం హసన్‌బాద గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆర్‌డిఒ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె పలు రైతు సమస్యలను విని పరిష్కార మార్గాలను సూచించారు.కార్యక్రమంలో రెవిన్యూ అధికారి మ్.సావిత్రీ, గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు, మండల డిటి ఎమ్.చంద్రశేఖర్, ఎంపిటిసి సభ్యులు యర్రం దేవి, ఉప సర్పంచ్ నీలం భవాని, వార్డు సభ్యులు, విఆర్‌ఒ సత్తిబాబు సిబ్బంది, గ్రామ రెవెన్యూ సిబ్బంది, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆలమూరు: ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల ద్వారా రైతు సమస్యల పరిష్కారంతో పాటుగా సంక్షేమ పథకాల అందజేతకు చర్యలు తీసుకుంటామని తహసిల్దార్ కె.జె.ప్రకాష్ బాబు అన్నారు. మండలంలోని నవాబుపేటలో రెవెన్యూ సదస్సు ఆయన ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు.కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గురుచంద్ర స్వరూప్, మాజీ ఉపసర్పంచ్ నామాల సత్తిబాబు, ఆర్ఐ టి.రామాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట: రెవెన్యూ సదస్సు కొత్తపేట సర్పంచ్ జయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారుర. కార్యక్రమంలో తహశీల్దార్, మండల టిడిపి అధ్యక్షులు కంఠం శెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పెదపట్నం లంకలో రెవెన్యూ సదస్సుల అవగాహనా ర్యాలీ

రూ.246 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు : మంత్రి సుభాష్

ప్రజాశక్తి -రామచంద్రపురం,

నియోజవర్గంలో రూ.246 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. శనివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్‌డిఎ కూటమి అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అయిందన్నారు. పార్టీలకు అతీతంగా, కక్ష సాధింపు లేకుండా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు చేపట్టామని అన్నారు. నియోజవర్గంలో రోడ్ల మరమ్మతుల కోసం ఆర్‌అండ్‌బి, పంచాయతీరాజ్ ద్వారా రూ.15 కోట్లతో పనులు చేస్తున్నట్టు తెలిపారు. మంచినీటి పథకానికి రూ.9.72 కోట్ల పనులు, డ్వాక్రా స్వయం సహాయక సంఘాలకు రూ.116 కోట్లు అందించామన్నారు. ఇటీవల వరదల వల్ల జరిగిన పశునష్టం, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం, పశువుల షెడ్ల నిర్మాణం వంటి పనులకు నిధులు కేటాయించా మన్నా రు. గడచిన ఆరు నెలల్లో రూ.246 కోట్లతో రామచంద్రపురం నియోజవర్గం అభివృద్ధి చేశామని అన్నారు. నియోజవర్గంలో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు కింద రూ.73.84 కోట్లు పంపిణీ చేశామ న్నామని అన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.6.89 కోట్లతో, సిఎం సహాయ నిధి ద్వారా 46 మంది నిరుపేదలకు రూ.86 లక్షలు ఆర్థిక అందజేశామని అన్నారు. పలుమార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి రూ.32 వేల కోట్ల ప్రజలపై భారం మోపిన గత వైసిపి ప్రభుత్వం ఇప్పుడు నిరసనలు వ్యక్తం చేయడం, కూటమి ప్రభుత్వం పై బురద చల్లే ప్రయత్నంలో భాగమన్నారు. సిఎం చంద్రబాబు గత ప్రభుత్వ హయాంలోనే 1.5 లక్షల ఉపా ధ్యాయ పోస్టులు నియామకం చేపట్టారని అన్నారు. ప్రస్తుతం మెగా డిఎస్‌పి ద్వారా సుమారు 16,450 ఉపాధ్యాయ పోస్టులు నియామకానికి కస రత్తు జరుగుతోందని అన్నారు. గత వైసిఎప్రభుత్వ హయాంలో ఒక ఉద్యోగమైన ఇచ్చారా అని మంత్రి సుభాష్ ఈ సందర్భంగా ప్రశ్నించారు.

మునీశ్వరమ్మ చిత్రపటం వద్ద మాజీ ఎంఎల్‌ఎ జగ్గిరెడ్డి తదితరుల నివాళి

మునీశ్వరమ్మ మృతి తీరని లోటు

ప్రజాశక్తి - ఆలమూరు

గత వైసిపి ప్రభుత్వ హయాంలో ఆలమూరు ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ గా పనిచేసి పేదలకు విశేష సేవలు అందించిన చల్లా మునీశ్వరమ్మ (80) మృతి తీరని లోటని కొత్తపేట మాజీ ఎంఎల్ఎ, మాజీ ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పసుపులేటి వారి వీధిలో ఉన్న ఆమె నివాసానికి శనివారం స్థానిక వైసిపి శ్రేణులతో కలిసి చిర్ల జగ్గిరెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా మునీశ్వరమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ఆమె కుటుంబ సభ్యులు ప్రభాకరరావు, నానాజీ, భూషణం తదితరులను మాజీ ఎంఎల్ఎ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి అభివృద్ధికి ఆమె అందించిన విరాళాలు, అప్పటి ప్రభుత్వ సహకారంతో చేపట్టిన సేవా, సామాజిక కార్యక్రమాలను జగ్గిరెడ్డి గుర్తు చేసుకున్నారు. ఆయన వెంట వైసిపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస్, ఎంపిపి తోరాటి లక్ష్మణరావు, జడ్‌పిటిసి సభ్యురాలు తోరాటీ సీతామహాలక్ష్మి, రాంబాబు, మాజీ జడ్‌పిటిసి సభ్యురాలు బొక్కా వెంకటలక్ష్మి, ఉప సర్పంచ్ నాంద్ర నాగ మోహన్ రెడ్డి, నాయుడు ప్రసాద్, కోలా నాని, జవ్వాది రవి, ఉండమట్ల బూరయ్య, తదితరులు ఉన్నారు..

మృతుని కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నగర పంచాయతీ పరిధిలోని జిఎంసి బాలయోగి కాలనీ కి చెందిన టిడిపి సీనియర్ కార్యకర్త దున్నాల నాగమణి భర్త సత్తిబాబు ఆకస్మికంగా మృతి చెందాడు. మృతుని కుటుంబాన్ని శనివారం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు పరామర్శించారు. ఈ సందర్భంగా సత్తిబాబు చిత్రపటానికి ఎంఎల్ఎ సుబ్బరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చెల్లి అశోక్, దొమ్మేటి రమణ కుమార్, దాట్ల పవన్, గొల్లపల్లి గోపి, చింతపల్లి రాజు, కటికిదల వివేకానంద మహమ్మద్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

మైక్రో ఇరిగేషన్ ఇంజినీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ఔట్‌సోర్సింగ్ విధానంలో మైక్రో ఇరిగేషన్ ఇంజనీరు పోస్టుల భర్తీ కోసం ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎపిఎంఐపి పథక సంచాలకుడు, జిల్లా సూక్ష్మ సేద్య అధికారి ఎ.దుర్గేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారు ఎపి సూక్ష్మ సేద్య పథకం రాజమహేంద్రవరం కార్యాలయములో విధులను నిర్వర్తించాల్సి ఉంటుందన్నారు. బి.టెక్ (అగ్రికల్చర్ ఇంజనీరింగ్) విద్యార్హత కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తుతో పాటు ఎస్‌ఎస్‌సి ఇతర విద్యార్హతల మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ పత్రాలను విధిగా జతపరిచి, ఈ కార్యాలయ ఇ-మెయిల్ pmiprecruitment@ gmail.comకు జనవరి 18 సాయంత్రం 5 గంటల్లోపు పంపాలని తెలిపారు. ఉజనవరి 22న ఉదయం 10.30 గంటలకు వైటిసి భవనం, రూరల్ తహశీల్దారు కార్యాలయం పక్కన, బొమ్మూరులోని ఎపిఎంఐపి కార్యాలయం వద్ద మౌఖిక పరీక్షకు అన్ని ధవపత్రాలు, ఒక ప్రతి నకలుతో హాజరవ్వాలని తెలిపారు.

1000 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-తాళ్లపూడి

మానవత శాఖ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం జిఎస్ఎల్ ఆసుపత్రి సహకారంతో తాళ్లపూడిలో శనివారం నిర్వహించిన మెగా వైద్య శిబిరాన్ని మండల మానవత శాఖ గౌరవ చైర్మన్ సింహాద్రి జనార్ధనరావు ప్రారంభిం చారు. ఈ వైద్య శిబిరంలో వెయ్యి మందికి వైద్య సేవలందించారు. సొలస సత్యనారాయణ దమయంతి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో జరిగిన ఈ వైద్య శిబిరంలో జిఎస్ఎల్ ఆసుపత్రికి చెందిన వివిధ విభాగాలకు చెందిన 30 మంది వైద్యులు పరీక్షలు నిర్వహించారు. ఉచిత పరీక్షలతో పాటు అవసరమైన వారికి మందులు అందజేశారు.

బాలబాలాజీ స్వామి ఆదాయం రూ.2.12 లక్షలు

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ దేవస్థానమునకు శనివారం రూ.2,12,910 ఆదాయం సమకూరిందని ఆలయ ఇన్‌ఛార్జి, సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణ రాజు ఒక ప్రకటనలో తెలిపారు 3,500 మంది యాత్రికులు స్వామివారిని దర్శనం చేసుకున్నారని తెలిపారు. 2,429 మంది యాత్రికులు స్వామివ ఆరి అన్న ప్రసాదం స్వీకరించారని ఆయన తెలిపారు.

బాల్యవివాహాలు, మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

బాల్యవాహాలు, మానవ అక్రమ రవాణా, అరికట్టవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఐసిడిఎస్ సిడిపిఒ ఎ.గజలక్ష్మి, ఎంపిడిఒ కె.రత్నకుమారి, అన్నారు. శనివారం కపిలేశ్వరపురం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి కిశోర్ వికాస్ శిక్షణా కార్యక్రమంలో పాల్గొనిమాట్లాడారు . ఈ సందర్భంగా మహిళాభివద్ధి, శిశు సంక్షేమ శాఖ మండపేట ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని కపిలేశ్వరపురం మండల గ్రామస్థాయి, రిసోర్స్ గ్రూప్ గ్రామస్థాయిలోని జి ఎం ఎస్ కె ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ అసిస్టెంట్లు, నోడల్ టీచర్లు ,ఏఎన్ఎంలు, వెల్ఫేర్ ,అంగన్వాడీ కార్యకర్తలకు, కిశోర్ వికాసంపై శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌జిఒ కోఆర్డినేటర్ నాగేశ్వరి, వైద్యాధికారులు డాక్టర్ దుర్గాదేవి, డాక్టర్ రాజ్‌కుమార్, ఎంపిహెచ్ఇఒ జె.మల్లికార్జునుడు, వెలుగు ఎపిఎం కృష్ణకుమారి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థికి రూ.50 వేల సాయం

ప్రజాశక్తి - మండపేట

చికిత్స నిమిత్తం పూర్వ విద్యార్థికి ఉపాధ్యాయులు, విద్యార్థులు శనివారం రూ.50 వేలు సాయం అందజేశారు. మండలం ద్వారపూడి బాల మణికంఠ పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థి అనదాసు వెంకటరమణ ఈ నెల 19న శ్రీరాంపురంలో రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. దీంతో స్థానికులు అతనిని ప్రయివేటు ఆసుపత్రికి తీసుకు వెళ్లారు. అతని తలకు గాయం అవ్వడంతో బ్రెయిన్‌కి శస్త్రచికిత్స చేయాలని వైద్యులు సూచించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న బాలమణికంఠ పాఠశాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు సహకారంతో రూ.50 వేలను సమీ కరించారు. ఈ నగదు మొత్తాన్ని వెంకట రమణ కుటుంబ సభ్యులకు శనివారం రాజమహేంద్రవరం వెళ్లి అందజేశారు.

బాధిత కుటుంబానికి సాయం అందజేత

మహిళల ఆర్థిక ప్రగతికి మెప్మా బజార్లు దోహదం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థిక ప్రగతిని సాధించడానికి మెప్మా అర్బన్ బజార్లు దోహదం చేస్తాయని నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్ సూచించారు. నగర పంచాయతీ కార్యాలయం ఆవరణలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అర్బన్ బజార్ ను శనివారం చైర్మన్ ప్రవీణ్ కుమార్ ప్రారంభిం చారు. ఈ కార్యక్రమంలో తాడి నరసింహారావు, కమిషనర్ పి.రవివర్మ, మేనేజర్ పివి.నూకరాజు, ఆర్ఐ భాస్కరరావు. టిపిఒ రాజేష్ బాబు, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ (సిఎంఎం) ఎస్.భాస్కర్, కోఆర్డనేటర్ రాజేశ్వరి, ఆర్‌పిలు, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మెప్మాబజార్ ప్రారంభిస్తున్న చైర్మన్ ప్రవీణ్ కుమార్

వైసిపి హయాంలోనే విద్యుత్ ఛార్జీల భారం

ప్రజాశక్తి - కొత్తపేట

గత వైసిపి హయాంలో చేసిన అవినీతి విద్యుత్ వ్యవస్థను నాశనం చేయడమే కాక ప్రజలపై ఛార్జీల భారం పడిందని కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. వాడపాలెం కార్యాలయం శనివారం జరిగిన పాత్రికేయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సత్యానందరావు మాట్లా డుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో జగన్ అవినీతి, అసమర్థతతో రూ.లక్షా ఇరవై తొమ్మిది వేల కోట్ల నష్టం వాటిల్లిందని ఆరోపించారు. సమావేశంలో కంఠంశెట్టి శ్రీనివాస్, ముత్యాల బాబ్జీ, పల్లి కుమార్ రాజా, పెచ్చెట్టి చిన్నారావు, బీర ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన చేయడం విడ్డూరం

అమలాపురం: ఆరు నెలల్లో విద్యుత్ చార్జీలపై వైసిపి ఆందోళన చేయడం విడ్డురం గా ఉందని ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు విమర్శించారు. అన్నారు. ఎంఎల్ఎ ఆనందరావు తన క్యాంపు కార్యాలయం లో శనివారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశం లో అముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, పట్టణ అధ్యక్షులు తిక్కిరెడ్డి నేతాజీ లు పాల్గొన్నారు.

చేతి వృత్తుల వారికి శిక్షణ

ప్రజాశక్తి - ముమ్మిడివరం

పేద వర్గాలకు చెందిన చేతి వృతుల వారికి ఉచిత నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు మెప్మా సిటీ మేనేజర్ రాజేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పంచాయతీ పరిధిలోని ప్లంబర్, కార్పెంటర్, ఎలక్ట్రిషియన్, ఎసి, గ్రీజర్, టివి, రిఫ్రిజరేటర్, వాషింగ్ మిషన్ రిపేర్, బ్యూటిషియన్ (పురుషులు, స్త్రీలు) కోర్స్, వాటర్ ప్యూరిఫైర్ వంటి చేతి వృత్తుల్లో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.వీటి కొరకు ఈ నెల 30,31 తేదీలలో నగర పంచాయతి మెప్మా విభాగాన్ని సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. నమోదు కొరకు వచ్చే వారు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్, పాన్ కార్డు జెరాక్స్ తీసుకుని రావాలని సూచించారు. వివరాల కొరకు సెల్ నెంబర్లు 79016 10085, 79016 10069,95050 28113, 19499 సంప్రదించాలన్నారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

లయన్స్ ఆధ్వర్యంలో కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి - రావులపాలెం

స్థానిక రావులపాడు రోడ్డు జయశ్రీ ఆసుపత్రి భవనం వద్ద సాయిరాం ఆసుపత్రిలో శనివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో వందమందికి వైద్య పరీక్షలు నిర్వహించారు.వారిలో 40 మందికి కళ్ల జోళ్లు లైన్స్ క్లబ్ వారు అందజేశారు. ఏలూరు ఆశ్రమం ఆసుపత్రి వారు నలుగురు వ్యక్తులకు కంటి ఆపరేషన్ చేసేందుకు సహకారాన్ని అందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ లయన్ కర్రి సుబ్బారెడ్డి, లయన్ చిర్ల కనికి రెడ్డి, లయన్ కర్రి శ్రీరామ చంద్రారెడ్డి, లయన్ మన్యం ప్రదీప్, లయన్స్ క్లబ్ సభ్యులు, మన్యం వర్ధనరావు, మన్యం రాఘవరావు, అధిక సంఖ్యలో రోగులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లో కమిషనర్ తనిఖీ

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నగర పంచాయతీ పరిధిలోని స్థానిక బళ్ల గేటు సెంటర్‌లోని అన్న క్యాంటీన్‌ను శనివారం కమిషనర్ పి.రవి వర్మ ఆకస్మిక తనిఖీ చేశారు. హార పదార్థాలు నాణ్యతతో ఉన్నాయా, టోకెన్ విధానం, పరిసరాల శుభ్రత వంటి వాటిని ఆయన పరిశీలించారు. అనంతరం పదో వార్డులో జరుగుచున్న సిసి రోడ్ల నిర్మాణ పనులను, పోలమ్మ చెరువు గట్టు ఆవరణలో జరుగుతున్న పార్కు బ్యూటీ ఫికేషన్ పనులను పరిశీలించి, నాణ్యతతో, త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట మేనేజర్ నూకరాజు ఎఇ పి వి సుధాకర్ టిపిఒ రాజేష్ బాబు, నగర పంచాయతి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాస్ పోర్ట్ పడిపోయింది

పి గన్నవరం మండలం నరేంద్రపురం గ్రామాని కి చెందిన కుసుమ సంపూర్ణ కుమారి W/o కుసుమ అర్జున్ రావు కు చెందిన **Y1469301** నెంబరు కల పాస్ పోర్ట్ పడిపోయినది. జిరాక్స్ నిమిత్తము ఈ నెల 23వ తేదీన నరేంద్రపురం నుండి పి.గన్నవరం వచ్చుచుండగా మార్గమధ్యలో పడిపోయినది. దొరికిన వారు క్రింది అడ్రస్ కు అందజేయగలరు.

కుసుమ సంపూర్ణ కుమారి,
W/o కుసుమ అర్జున్ రావు,
నరేంద్రపురం,పి గన్నవరం మండలం-533229,
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా,
సెల్ :6301003659

మహారాజశ్రీ కాకినాడ 6వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

I.A. No. 208/2021 in A.S. No. 27/2021

Between:
మానేపల్లి సుబ్రహ్మణ్యం **-పిటీషనర్/అపిలెంటు**
మరియు
కవులూరి భవాని, వగైరా **-రెస్పాండెంట్స్/ రెస్పాండెంట్స్**

R-4: బేతల తులసి, W/o. రాజు, డో.నెం. 57-9-66, మల్లిఖార్జున నగర్, రాజమహేంద్రవరం.
R-8: మానేపల్లి చిరంజీవులు, W/o. వెంకటేశ్వరులు, డో.నెం. 49-3-5, సామర్లకోట.
R-10: మానేపల్లి రఘు, S/o. వెంకటేశ్వరులు, డో.నెం. 49-3-5, సామర్లకోట.
R-11: ఇంజరపు నాగమణి, W/o. సత్యనారాయణ, డో.నెం. 49-3-5, సామర్లకోట.
R-12: కోటిపల్లి వెంకటలక్ష్మి, W/o. వీరబాబు, డో.నెం. 11-4-21, వీర్రాఘవపురం, సామర్లకోట.

పై నెంబరు అప్పీలు పిటీషనులో శ్రీ కోర్టు వారు మీకు ఎన్నిమార్లు నోటీసులు పంపిన తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నందున ఈ పేపరు పబ్లికేషను ద్వారా మీకు నోటీసు పంపడమైనది. కావున మీరు **ది. 06-01-2024వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టులో హాజరు అయి మీ అక్షేపణలు తెలియపరచుకోవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్పు ఇచ్చెదరు.

టి.పి.ఆర్.చంద్రశేఖర్, అడ్వకేట్
కాకినాడ, సెల్: 9440337629

మహారాజశ్రీ కాకినాడ 6వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

A.S. No. 27/2021

Between:
మానేపల్లి సుబ్రహ్మణ్యం **-అపిలెంటు**
మరియు
కవులూరి భవాని, వగైరా **-రెస్పాండెంట్స్**

R-4: బేతల తులసి, W/o. రాజు, డో.నెం. 57-9-66, మల్లిఖార్జున నగర్, రాజమహేంద్రవరం.
R-8: మానేపల్లి చిరంజీవులు, W/o. వెంకటేశ్వరులు, డో.నెం. 49-3-5, సామర్లకోట.
R-10: మానేపల్లి రఘు, S/o. వెంకటేశ్వరులు, డో.నెం. 49-3-5, సామర్లకోట.
R-11: ఇంజరపు నాగమణి, W/o. సత్యనారాయణ, డో.నెం. 49-3-5, సామర్లకోట.
R-12: కోటిపల్లి వెంకటలక్ష్మి, W/o. వీరబాబు, డో.నెం. 11-4-21, వీర్రాఘవపురం, సామర్లకోట.

పై కేసులో కోర్టు వారు మీకు ఎన్నిమార్లు నోటీసులు పంపిన తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నందున ఈ పేపరు పబ్లికేషను ద్వారా మీకు నోటీసు పంపడమైనది. కావున మీరు **ది. 06-01-2024వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టులో హాజరు అయి మీ అక్షేపణలు తెలియపరచుకోవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్పు ఇచ్చెదరు.

టి.పి.ఆర్.చంద్రశేఖర్, అడ్వకేట్
కాకినాడ, సెల్: 9440337629